## సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు



జడ్చర్ల టౌన్ : అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జడ్చర్లటౌన్, అక్టోబర్ 20 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాసరస్వతి దేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, కుంకుమార్చన, పల్లకీసేవ, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు.

**రాజాపూర్ మండలంలో..**

రాజాపూర్, అక్టోబర్ 20 : దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చొక్కంపేట, దొండ్లపల్లి, కుచ్చర్‌కల్ తదితర గ్రామాల్లో శుక్రవారం అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తిర్మలాపూర్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

**మిడ్జిల్ మండలంలో..**

మిడ్జిల్, అక్టోబర్ 20 : మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుతల్లో భాగంగా ఆరో రోజు సరస్వతీదేవి అవతారంలో అలకరించి నైవేద్యం సమర్పించారు.

## మన్యంకొండలో ప్రత్యేక పూజలు

పాలమూరు, అక్టోబర్ 20 : మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దివ్య ప్రబంధ సేవాకాలం, విశ్వక్సేనుల జన్మదిన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

రాజాపూర్, అక్టోబర్ 20 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో శుక్రవారం నాలుగు జట్లు ఫైనల్‌కు చేరినట్లు పీడీ వడెన్న తెలిపారు. శనివారం జరిగే ఫైనల్ వాలీబాల్, ఖోఖో పోటీల్లో ఖమ్మం-రంగారెడ్డి, మహబూబ్‌నగర్-ఆదిలాబాద్ జట్లు తలపడనున్నాయి. అలాగే బాలికల వాలీబాల్, ఖోఖోలో నల్లగొండ-వరంగల్, రంగారెడ్డి-నిజామాబాద్ జట్లు తలపడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, ఎస్సై వెంకట్‌రెడ్డి, పీడీలు గజానంద్, రాంకల్యాణ్, ఉమాదేవి, మణి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

బాలానగర్, అక్టోబర్ 20 : మండలంలోని చిన్నరేవల్లి, పోచమ్మగడ్డతండా, తిరుమలగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా బంగారు మైసమ్మ బోనాలు

నవాబ్‌పేట, అక్టోబర్ 20 : మండలంలోని కొల్లూరు గ్రామ పంచాయతీ సత్రోనిపల్లితండాలో శుక్రవారం బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. బోనాలు, ఎద్దుల బండ్లను అమ్మవారి ఆలయం చుట్టూ ఊరేగించారు. అమ్మవారికి నైవేద్యం, అభిషేకం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొల్లూరు, దేపల్లి, చౌడూర్, వెంకటేశ్వరతండా, బట్టోనిపల్లితండాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 20 : బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక్కరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన జడ్చర్ల మండలం బూరెడ్డిపల్లి గ్రామ స్టేజీ వద్ద 44జాతీయరహదారిపై చోటుచేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం.. జడ్చర్ల మండలంలోని ఆలూర్‌కు చెందిన దాసరి చెన్నయ్య భార్య ముణెమ్మ, కుమార్తె దాసరి మోనికతో కలిసి బైక్‌పై 44వ జాతీయరహదారిపై బూరెడ్డిపల్లి స్టేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా, అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముణెమ్మ అక్కడిక్కడే మృతిచెందగా, చెన్నయ్య, మోనికకు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ ప్రమాద స్థలానికి చేరుకుని వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్‌లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్సై చెప్పారు.

# కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలి

- లక్ష మెజార్టీ దిశగా కృషిచేయాలి
- పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన ఆయా పార్టీల నాయకులు



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

జడ్చర్ల/నవాబ్‌పేట/బాలానగర్, అక్టోబర్ 20 : కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి లక్ష మెజార్టీ అందించే దిశగా కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. జడ్చర్ల పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాదేపల్లి, కావేరమ్మపేటకు చెందిన 50 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే నవాబ్‌పేట మండలంలోని కారూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, కారూర్ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చెన్నారెడ్డిపల్లికి చెందిన 25 మంది, మల్లారెడ్డిపల్లికి చెందిన 15 మంది, కారూర్‌కు చెందిన 20మంది నాయకులు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే బాలానగర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌతాపూర్ గ్రామానికి చెందిన 10 మంది బీఎస్పీ నాయకులు రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఉడిత్యాల గ్రామానికి చెందిన 10 మంది కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన పదేండ్లల్లో సర్కారు చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి.. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక సర్కారు బీఆర్ఎస్సే అని అన్నారు. జడ్చర్ల పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ కట్ అవుతుందని గ్రహించిన ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్చర్ల కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, మహేశ్, పీఏసీసీఎస్ చైర్మన్ మల్లేశ్, రామ్మోహన్, బాలకృష్ణ, చెన్నకేశవులు, బాలానగర్ వైస్ ఎంపీపీ వెంకటాచారి, విండో డైరెక్టర్ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సర్పంచ్ రాంరెడ్డి, నవాబ్‌పేట ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచులు గోపాల్‌గౌడ్, యాదయ్యయాదవ్, లక్ష్మారెడ్డి, నాయకులు నర్సింహులు, రాంప్రసాద్, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భోజయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

**దైవచింతన అలవర్చుకోవాలి**

బాలానగర్, అక్టోబర్ 20 : ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాయపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. గ్రామ దేవత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అందరూ కలిసికట్టుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీజీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటాచారి, సింగిల్ విండో డైరెక్టర్ నాగిరెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ శంకర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు లక్ష్మయ్య, శివానందరెడ్డి, భూపాల్, మనోహర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహులు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నిజాం, లింగం, జనార్ధన్ ఉన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి



జడ్చర్లలోని ఈవీఎం, స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

జడ్చర్ల, అక్టోబర్ 20 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్‌రూంను శుక్రవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన సూచనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్రాలు ఉండాలని, అదేవిధంగా ఈవీఎంల కమిషనింగ్, భద్రతా చర్యలను పరిశీలించారు. కళాశాల గదులు, అధికారులు, సిబ్బంది తదితరులకు అవసరమైన సౌకర్యాలు, ఈవీఎంలను భద్రపరిచే గదుల వద్ద సీసీ కెమెరాలను పరిశీలించారు. కళాశాల సెమినార్‌హాల్‌ను పరిశీలించి ఓట్లలెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే విషయాలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. జడ్చర్ల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైతే మార్పులను చేయాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సందర్భంగా సిబ్బందికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బారికేడ్లు, పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్, టాయిలెట్లు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కలెక్టర్ వెంట జడ్చర్ల తాసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**బీఎల్‌వోలకు అవగాహన**

జడ్చర్ల, అక్టోబర్ 20 : 80ఏండ్లు పైబడిన వృద్ధులు, మంచం నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారు, 40శాతం పైబడి అంగవైకల్యం కలిగిన వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడంపై శుక్రవారం బీఎల్‌వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్చర్లలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు హాజరై సూచనలు చేశారు. సమావేశంలో తాసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తాసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఆర్ఐ సలావుద్దీన్ ఉన్నారు.

## ఎస్‌బీఐ సేవలపై అవగాహన

జడ్చర్ల టౌన్, అక్టోబర్ 20 : ఎస్‌బీఐ ఆధ్వర్యంలో పెన్షనర్లకు అందిస్తున్న సేవలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ నర్సింగ్‌నాయక్ అందిస్తున్న సేవలను గురించి వివరించారు. బ్యాంకు సేవలు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అరుణ్, ఫీల్డ్ అధికారులు శ్రీనివాస్‌రావు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## దాతలకు గ్రామస్తుల కృతజ్ఞతలు

రాజాపూర్, అక్టోబర్ 20 : మండలంలోని రాయపల్లిలో దుర్గామాత ఆలయం గోపురం నిర్మాణంలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నామని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి, బాలానగర్ మార్కెట్ కమిటీ డైరక్టర్ మల్లేశ్‌గౌడ్ తెలిపారు. రాయపల్లి గ్రామస్తుల విన్నపం మేరకు వారు రూ.6.50లక్షలు వెచ్చించి ఆలయం గోపురం నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సహకరించడంపై దాతలను గ్రామస్తులు అభినందించారు.

## వివరాలు నమోదు చేయాలి

పాలమూరు, అక్టోబర్ 20 : జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో శుక్రవారం ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలతో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డేటాను వందశాతం ఆలన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంవో శ్రీనివాస్, ప్రణాళికా విభాగం కోఆర్డినేటర్ గోవర్ధన్‌గౌడ్, ఎంఈవో జయశ్రీ, క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా



బి.రాజేందర్‌రెడ్డి

పాలమూరు, అక్టోబర్ 20 : జిల్లా కేంద్రానికి చెందిన బి.రాజేందర్‌రెడ్డికి భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. శుక్రవారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో గల స్వామి రామానంద తీర్థ మరట్వాడా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. మరట్వాడా విశ్వవిద్యాలయం ప్రొ ఫెసర్ భోగ్లే పర్యవేక్షణలో డెవలప్ ఆఫ్ మల్టిఫెర్రోయిక్‌థిన్ ఫిలిమ్స్ అండ్ స్టడీ ఫర్ నాన్ వలాటైల్ మెమెరీ డివైస్ అప్లికేషన్ అనే అంశాలపై ఆయన పరిశోధన చేశారు. ప్రస్తుతం రాజేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

## ఆర్టీసీ లక్కీడ్రాను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 20 : ఆర్టీసీ ఆఫర్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ డిపోలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రయాణికులకు, ఉద్యోగులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో పయాణించే వారు టికెట్ వెనుకపేరు, ఫోన్ నెంబర్ రాసి లక్కీ డ్రాలో బహుమతి కోసం డ్రాప్ బాక్సుల్లో టికెట్ వేయాలని కోరారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.